# తపస్సు

ఇచ్ఛాపురపు రామచంద్రం

నా పేరు జానకి.

ఆకర్షణీయంగానూ కాక అసహ్యం గానూ కాక మామూలుగా ఉంది కదూ?

ఔను.

నాకు తగ్గట్టే నా పేరూ!

నేను అందంగానూ ఉండను, వికారం గానూ ఉండను.

అతి సాధారణమయిన రూపం నాది.

నా చదువు విషయమూ సరిగ్గా అంతే. నేను చదువుల సరస్వతిని కాను, చదువు రాని మొద్దునీకాను. ఇంటర్మీడియట్ పాసయ్యాను—బొటాబొటి మార్కులతో.

నా రంగు చామన చాయ. మిసమిస లాడుతూ మేలిమి బంగారు ఛాయకాదు.

అప్పుడే కుంపట్లోంచి తీసిన మసి బొగ్గులా నల్లని రంగూ కాదు-తెలుపూ నలుపూ కాని నా ఛాయను కొందరు కుక్క రంగని వెక్కిరించడం నేను వినక పోలేదు.

నేను — ముద్ద బంతి పూవులా బొద్దు గానూ ఉండను, ములక్కాడలా సన్నం గానూ ఉండను.

నేను - పెద్దదాన్నీ కాను, చిన్నదాన్నీ కాను, నా వయసిరవై.

నాది - గొప్ప కుటుంబమూ కాదు, పేద కుటుంబమూ కాదు.

నేను—ఉన్నత తరగతికి చెందను, దిగువ తరగతికీ చెందను. మధ్య తరగతి దాన్ని.

ఈలక్షణాలతో నేను సగటు అమ్మాయి నని అను కుంటున్నాను.

మన సమాజంలో నాలాటి సగటు అమ్మాయిల సంఖ్య ఎక్కువనే నా నమ్మకం.

○ ○ ○

నే నేనాడూ-కలలో కూడా ప్రధాన మంత్రి నవ్వాలనుకోలేదు. కాని....

నేనూ ఓ భార్యననిపించు కోవాలని కోరుకున్నాను.

వెండి తెర తారనై వెలుగొందాలని ఆశపడలేను.

ఎవడో ఒకడికి భార్యనై తరిద్దా మను కున్నాను.

నన్ను పూలలో పెట్టి పూజించే పూజారి మొగుణ్ని కోరుకోలేదు.

ఇంత తిండిపెట్టి భద్రత యివ్వగలిగే మగాడు చాలనుకున్నాను.

నా కలలలోకి రాజకుమారులు రాలేదు.

గుమాస్తాలే వచ్చారు.

నా ఊహాలలోకి - కార్లు రాలేదు.

కాలి నడకలే వచ్చాయి.

మేడలలో తిరగాలని ఉవ్విళ్ళూరలేదు.

గూడులో ఒదిగుందామనే సరిపెట్టుకున్నాను.

అందం ఉట్టిపడే చీరలు కట్టాలనుకోలేదు.

అవసరమయిన మేర - వొళ్ళు కప్పుకుందుకు కోక ఉంటే చాలనుకున్నాను.

ఘనంగా జీవించాలని తపించలేదు. సామాన్యంగా, బ్రతక గలిగితే అదే పదివేలనుకున్నాను.

మీరే చెప్పండి.

నావి కొరగాని కోరికలా?

నిజం వదలిన కలలా?

గాలి మేడలా?

కావు కదూ?

నావి - మొదలంటూ కత్తిరించబడిన కోరికల ముక్కలే కదూ?

ఆశల శకలాలే కదూ?

మరి - యింత చిన్న... సామాన్యమైన.... చచ్చు కోరికలు కూడా తీరవేం?

కారణం - నేనూ నా అసమర్థతేనా?

○ ○ ○

నాకు తెలుసు—

నేను మా అమ్మా నాన్నలకి గారాబు పట్టిని కాను.

వాళ్ళ గుండెలమీద కుంపటిని. కుంపటేం ఖర్మ, గాడి పొయ్యినే. కణ కణ మండే గాడి పొయ్యినే. ఔను మరి. పెళ్ళి కాని ఆడపిల్ల ఆ తల్లి తండ్రుల హృదయాల మీద భగ భగ మండే అగ్ని పర్వతమేనట!

నన్నీ యింటి నుంచి ఎంత త్వరగా మరో యింటికి సాగనంపుదామా అని మా వాళ్ళ ఆత్రత. నిజానికి - నాకూ ఆరాటంగానే ఉంది. యిక్కడి నుంచి వెళ్ళిపోయి మా వాళ్ళకి సంతోషం కలిగిద్దామని.

కొంత మంది ఒంధువులుండీ, మరికొంత మంది వెళ్ళి ఆనందం కలిగిస్తారుట.

ఆడపిల్ల కూడా-వెళ్ళి సంతోషింపజేసే బంధువుల కోవలోనే జమ ఔతుం కాబోలు!

ఒంటి చేత్తో చప్పట్లు కొట్టలేము కదా? ఈ యింటి నుంచి బయట పడడానికి నేను సిద్ధంగా ఉన్నా అవతల మరో యిల్లు నన్ను రానివ్వాలి కద? పరలోకానికి వెళ్ళే జీవుడు వైతరణి దాటాలట, ఈ వైతరణి తరణం దుర్భరం దుష్కరమూ - అది నాకు తెలియదు కాని ఆడపిల్ల అత్త వారింటికి వెళ్ళేముందు పెళ్ళి చూపులనే క్రూర-ఘోర-దుస్సహ క్రీడలో గెలుపొందితీరాల్సిందే. ఇది-ముఖ్యంగా-నా వంటి సగటు అమ్మాయిలకు తప్పనిసరి. ఈ ఖేలలో గెలుపొందడానికి శక్తి వంచన లేకుండా నేను ప్రయత్నించాను.

అహం (మొదట్లో కొంచెం ఉండేది. ఇప్పుడు మాత్రం పూర్తిగా శూన్యం) చంపుకుని, ఆత్మాభిమానాన్ని (ఇది డిటోయే) అవతలికి నెట్టి, అమ్మా నాన్నలు చెప్పినప్పుడల్లా....పెళ్ళి చూపుల నిత్య సస్పెన్స్ నాటకంలో నిర్జీవమైన హీరోయిన్ పాత్ర అంగీకరిస్తూనే వచ్చాను!

కూర్చోమంటె చాలు-పెళ్ళి చూపులకు కూర్చున్నాను.

పలక మన్నది పలికాను.

పాడమంటే పాడాను.

ఆడమనలేదు కానీ ఎవరూ-ఆడేదాన్నే.

నడవమంటే నడిచాను.

ఉండమంటే ఉన్నాను పొమ్మంటే పోయాను.

ముక్కూ మొగమూ తెలియని వారు చేసిన ఆజ్ఞల నౌదల దాల్చాను.

ఆట బొమ్మనయ్యాను.

కొంచెమయినా విసుక్కోలేదు.

ఎందుకని?

తాపత్రయం. ఆశ!

ఈ రాముడు లేక పోతే మరో దేముడయినా కరుణించడా అని.

ఈ ప్రభువు లేక పోతే మరో విభుడయినా కాపాడ్డా అని.



ఏ నాధుడయినా కనికరించి నా కన్నె చెర విడిపించడా అని.

ఇందులోనూ నాది కింది చెయ్యే.

వధూ వరుల పరస్పరాంగీకారం అనేది వట్టి మాట. నేతి బీరకాయలో నెయ్యి.

నాకు వరుడు నచ్చడమన్న ఆలోచనే లేదు. వరుడికి నేను నచ్చాలి. అలాగని.

వెయ్యి దేముళ్ళకి మొక్కుకునేదాన్ని-పెళ్ళి చూపులకి కూర్చోబోతూం.

కొందరికి నేను నచ్చాను!

కాని-ఏం లాభం?

ఆడపిల్ల పెళ్ళంటే నచ్చడం ఒక్కటే కాదు కదా యీ నాగరికపు రోజుల్లోకి? పాత కాలంలో అయితే గాంధర్వ వివాహాలూ, రాక్షస వివాహాలూ యిట్టే జరిగేది అమ్మాయి నచ్చితే. కాని-యిప్పుడు-కట్నం కూడా నచ్చాలి. మీరు మరోలా అనుకోకపోతే నా మనసుని దొలుస్తున్న మాట చెప్పేస్తాను. ప్రస్తుతపు పెళ్ళిళ్ళు వధూ వరులకి మాత్రమే కాదేమో. ఎందుచేతనంటే.

వరుడు వధువుని చూస్తాను.

వరుడి తండ్రి-కట్నాన్ని చూస్తాడు.

వరుడి తల్లి-సంప్రదాయమూ వధువు పనీపాటలూ చూస్తుంది.

వరుడి అక్క చెల్లెళ్ళు-లాంఛనాలు చూస్తారు.

అందరికి నచ్చితేనే పెళ్ళి జరుగుతుంది.

ఏది ఎవరికి నచ్చక పోయినా జరగదు.

వరుడికి నేను నచ్చినంత మాత్రన ఏం లాభం?

వరుడి తండ్రికి మా నాన్న యివ్వ గల నన్న కట్నం నచ్చేది కాదు.

వాళ్ళు-పదివేలో పదిహేనువేలో అడగడం, మా నాన్న చచ్చీ చెడీ నాలుగు వేలో ఐదువేలో అనడం-గడ గడ వణికి పోతూ. దానితో వాళ్ళు పురుగుని చూసినట్టు చూసి, తిన్నదానికి కృతజ్ఞతే నా తెలియ జెయ్యకుండా-మారు మాట లేకుండా-అదే పోవడం!

నాన్న మాత్రం ఏం చేస్తాడు? ఏం చెయ్య గలడు?

మామూలు గుమస్తా. మా మూళ్ళ గుమాస్తాయేనా కాదు.

సంపాదన తక్కువ. సంతానం ఎక్కువ.

బడి పంతుళ్ళకి పిల్లలెక్కువంటారు కానీ....బీద వాళ్ళందరికీ సంతాన పుష్కలమే ఏమో!....దరిద్రానికీ సంతతికీ బంధుత్వం గట్టిది కాబోలు.

నన్ను-దుర్మార్గురాలనే అనుకోండి. మరేమన్నా అనుకోండి. ఇవాళ-నేను మీకు నా మనసులోని ఆలోచనలన్నీ చెప్పి వెయ్యడానికే తెగించాను. క్రూరంగానూ కుటిలంగాదానీ అనిపిస్తే నేనేమి చెయ్య గలను? నా కథ-కమ్మని కలకాదు. భరించ లేని బాధా, వ్యథా.

పెళ్ళి చూపులు జరిగి-కట్నం దగ్గర విఫలమైనరోజు. ఆరాత్రి నాకు కఠినమైన ఆలోచనలతో నిద్రపట్టక వేళ రాత్రి అయ్యేది.

దూరంగా-నాన్న గురక వినిపించేది ఏ అర్థరాత్రో. వంత పాడుతున్నట్లు అమ్మ గురక.

నాన్నా! నువ్వు నన్నెందుకు కన్నావు?

నీ బీదరికమూ.....అసమర్థతా....,అప్రయోజకత్వమూ నీకు తెలియవూ?

ఇంత సంతానాన్నేం చెయ్యాలని కన్నావు?

నారు పోసినవాడే నీరు పొయ్యక పోతాడా అనుకున్నారా?

చూడండి....మా బతుకుల్లో నీళ్లే కారుతున్నాయి. మా కళ్ళల్లో కన్నీళ్లే మిగిలాయి. మా జీవితాలు నీరుకారిపోతున్నాయి. చివరికివి నీరే ఔతాయి - మీ కళ్ళముందే. ఎందుకు కన్నారు మమ్మల్నందరినీ? పుట్టినందుకు - ఏడుస్తున్నాం మేమంతా! నా కళ్ళు నీళ్ళతో నిండిపోయేవి. మనసు కలత బారిపోయేది. నేనెంత వికృతంగా ఆలోచిస్తున్నానో నాకే తెలిసి వచ్చేది. కాని—ఏం చేసేది? కళ్ళు మూసుకుందుకు తెప్పలిచ్చిన దేముడు-ఆలోచనలు రాకుండా పెదవుని మూసుకుందుకు ఏ మూతా యివ్వలేద మరి. నా ప్రమేయం లేకుండానే యిలాంటి ఆలోచనలు వాటిష్టమొచ్చినట్లు సాగిపోతూంటే నిస్సహాయంగా మిగిలిపోయేదాన్ని. తరువాత నా ఆలోచనలు జ్ఞాపకం వస్తే నన్ను నేనే అసహ్యించుకునేదాన్ని, సిగ్గుపడేదాన్ని.

o o o


నాన్నమీద నాకు జాలి లేదనుకునేరు. అదేమీ కాదు.

బజారుకి వెళ్ళివచ్చి—"ధరలు పెరిగినట్లు జీతాలు పెరగవేం?" అని గొణుక్కునే వాడు. ఆయన ఓవిధంగా అమాయకుడే అని చెప్పాలి. లేకపోతే—ఎందుకలా అసలు విషయం తెలుసుకోకుండా, ధర్మసూత్రం ఎరుగకుండా అజ్ఞానంలో కొట్టుకుంటాడు? ధరలూ... మనుషుల వయస్సూ ఎప్పుడూ పెరుగుతూనే వుంటాయి పెరగడమే వాటి లక్షణం. తెలివైనవాడు-ధరలు పెరుగుతున్నాయని దిగులు పడడు. దాని కనుగుణంగా సంపాదన పెంచుకుంటాడు.—కాదూ? నాన్న నెలకోసారి తెచ్చే జీతం సంసారం పదిరోజులు సజావుగా గడవడానికే చాలేదికాదు. అదీ—మేమంతా అతి జాగ్రత్తగా ఉంటే. ఏమాత్రం దుబారా చెయ్యకుండా పొదుపుగాఖర్చుపెట్టుకుంటే.

ఇంట్లో ఎవరికయినా అత్యవసరంగా బట్టలు కొనాలన్నా,

మందులు కొనడం తప్పనిసరి ఐతే,

ఏ చుట్టాలో వస్తే-




అప్పు చెయ్యడం తప్ప అన్యమార్గం లేదు. ఆ చిల్లర అప్పులు తీర్చడంకోసం ప్రావిడెంట్ ఫండ్ లోను.

అప్పులు....వడ్డీలు.....తీర్చడం.....మళ్ళీ అప్పులు......మళ్ళీ తీర్చడం.......నెలనెలా పెరిగే కటింగ్స్... తరిగే జీతం....

నాన్న-యీ ఋణచక్రభ్రమణంకింద నిత్యం నలిగిపోతూనే ఉండేవాడు.

అప్పు చేసినవాడూ ఆడపిల్లలు కలవాడూ జీవితంలో ఎప్పుడూ వొడ్డున పడడట. మధ్యతరగతి మనిషికి తిరుగులేకుండా అన్వయించే నిష్ఠూర సత్యమిది.

నాన్నకి నేనంటే ప్రేమ లేకపోలేదు.

నాన్న మనసు నాకు తెలుసు.

కుటుంబ పరిస్థితి నిరుత్సాహకరంగా ఉండబట్టికాని, లేకపోతే నన్ను తప్పకుండా బి. ఏ. చదివించేవాడే. ఆవేళ అమ్మే యీసడించినట్లంది. "దీనికింక కాలేజీ చదువూ వద్దు-చట్టుబండలూ వొద్దు, పెళ్ళిచేసి అత్తారింటికి పంపండి" అని. అదీకాక—నా బొటాబొటి మార్కులు చూసి నాన్నకీ నీరసం వచ్చింది. నన్ను చదివించడ-అలా విఫలమైంది.

నాకు-మంచి సంబంధం చూసి-ఘనంగా కట్నమిచ్చి - యోగ్యుడైన వరునితో- వైభవంగా వివాహం చేసి-ఐశ్వర్యవంతుని యింటి కోడలుగానే పంపాలని కలలు కనేవాడు. కాని, నాన్న కలలు ఎలా నిజమౌతాయి? ఆయనకి నామీద చాలా అభిమానం ఉందికానీ-డబ్బు లేదుకదా? ఎన్నో పనులు డబ్బుతోనేకదా సాధ్యపడేవి? ఆ డబ్బు—నాన్నదగ్గర లేదని నాకు తెలుసు. పది రూపాయలకు పట్టుచీర వొస్తుందా ఈ రోజుల్లో? రాదు. రాదని నాన్నకీ తెలుసు

అయినా ఆశపడుతుంటాడు వస్తుందేమోనని.

ఇదంతా—నామీది అభిమానంవల్లనే. అందుకే నాన్నంటే, నాకు యిష్టం, జాలీ కూడా.

మా అందరికోసమూ తను పగలల్లా రెక్కలు ముక్కలు చేసుకుంటాడు. ఏడు నోళ్ళు నింపేందుకు ఆ రెండు చేతులే శ్రమించాలి. ఏడుగురిని - ఒక్క నాన్నే పోషించాలి. మధ్యతరగతి కుటుంబం అంటే యింతే కదా? తెచ్చేవాడొక్కడూ, తినే

వాళ్ళు ఎక్కువా. మందెక్కువయితే మజ్జిగ పలచన కాక మానదే కుటుంబం ...గేదొద్ద ...వని ప్రమాణం ...పేక తప్పదు.

అమ్మ ముఖంలోకి సూటిగా చూడాలంటే నాకు భయం, ఈ భయం నాకు మొదట నుంచీ ఉన్నదేకాదు. మధ్యలో వచ్చినది. అమ్మ రాక్షసికాదు. ఆమెకు నేనంటే వాత్సల్యం లేక కాదు కాని ...

తుంటెను కొడితే పళ్ళు రాలాయన్నట్టు నాకు పెళ్ళి కాలేదని నేను బాధపడటం మానినా ఆమె మాత్రం ఎప్పుడూ బాధ పడుతూనే ఉంటుంది. ఆ దిగులంతా గూడు కట్టుకుని ఆమె ముఖం ఎప్పుడూ నల్ల మబ్బులాగే కనిపిస్తుంది. అందుకే నాకు భయం-అమ్మ ముఖంలోకి సూటిగా చూడా లంటే. ఉండీ ఉండీ ఆమె చాటుగా కన్నీరు పెట్టు కుంటూ ఉంటుంది - నా కెప్పటికీ పెళ్ళి కాదేమో అన్న విచారంతో కాబోలు. నా గురించి అలా క్రుంగి కృశి స్తున్న అమ్మ ముఖం చూడాలంటే నాకు ఏదోలా కడుపులో దేవుతున్నట్లుంటుంది.

నిర్వ్యాపారత్వాన్ని మించిన శాపం మరొకటుండదు మనిషికి. పని లేని మంగలి పిల్లి బుర్ర గొరుగుతాడో గొరగడో కాని....పనిలేనివాళ్ళ మెదడులో మాత్రం పిచ్చి పిచ్చి ఊహలే నాట్యమాడు తుంటాయి. ఈ యింట్లో.... యీ మను షులమధ్య యిలాగే ఉంటే - పిచ్చెక్కడం తథ్య మనిపించింది.

ఉద్యోగం పురుషలక్షణమే కాదు, పెళ్ళి కా(బో)ని అమ్మాయి లక్షణం కూడా— అని గ్రహించి - ప్రయత్నాలు ప్రారంభిం చాను రహస్యంగా. దొంగలతల్లి కేడవ భయమట. నేను ఉద్యోగ ప్రయత్నాలు బాహాటంగా చేస్తే మావాళ్ళు హర్షించరు. మాది మధ్య తరగతి కుటుంబం కనుక కుహనా గౌరవాని కేమీ లోటుండదు.

నా ఇంటర్మీడియట్ క్వాలిఫికేషనుతో ఉద్యోగం సంపాదించడం-కుక్కతోక పట్టు కుని గోదావరీదడమే అని కొన్ని అనుభవా లయ్యే వరకూ అర్థం కాలేదు. అధికారులు ... "అర్హతలు చాల" వనేశారు.

ఆ- "అర్హతల" కర్థం వేరుట. అవి- లంచపు ... రికమండేషన్లూ నట! ఒహో, ఆడవ మాటలకిలాగే ఆఫీసర్ల మాటలకీ అర్థాలు వేరే ...లనుకున్నాను. వేలకి వేలు ... ముడుపు చెల్లించుకో గలి ... ం ఎందుకు? అంత డబ్బే ... ఉద్యోగం కొనుక్కోను. ...న్న కొనుక్కుందును. ఆయన లేన ప్పుడే కదా మంగలి అవసరం?

"అర్హతలు చాలక పోవ" డానికి నాకు విపరీతార్థాలు స్ఫురించాయి.

అర్హతలు చాలనిది - ఉద్యోగానికేనా, బ్రతకడానికి కూడానా?

తీవ్రంగా ఆలోచించాను.

నాకు పెళ్ళయ్యే సూచనలు ఎలాగూ లేవు. కనుక నన్నుపోషించే నాథుడుండడు.

అమ్మా నాన్నా ఎన్నాళ్ళు నన్ను పోషించగలరు? వాళ్ళ అనంతరం నా బ్రతుకెలా?

ఏదయినా బ్రతుకు తెరవు చూసు కుంటే?

o o o

"జానకీ, నీ చేతిలో మంచి పని పాటు న్నాయి. నువ్వు బాగావండగల" వంటూం అమ్మ. అవి - అమ్మ మాటలు కనుక, నా మీది ప్రేమాభిమానాల కొద్దీ కొంత అతి శయోక్తి ఉన్నా కొంతయినా నిజం ఉండక పోదనుకున్నాను. నా బ్రతుకు నేను బ్రతక గలిగడానికి ఒక తోవ కనిపించినట్లు యింది. అబ్బాయిల్లాగే అమ్మాయిలూ ఎక్కువకాలం అమ్మా నాన్నల మీద ఆధారపడి వారికి భారంగా ఉండలేరు.

ఆడపిల్లను కనుక అన్నం వండడమూ అంట్లు తోమడమూ నా జన్మ హక్కే.

సాహసించి - మా నాన్న ముందు నా ఆలోచన బయట పెట్టాను సందేహిస్తూనే.

"నాన్నా! మన యింటి పరిస్థితి అర్థం

చేసుకోలేనంత చిన్నదాన్ని చితక దాన్ని కాను ఎన్నాళ్లు మీ మీద ఆధారపడి ఉండేది? ఏ యింట్లోనో వంటపనిచేస్తే - వేణ్నీళ్ళకు చన్నీళ్ళులా నా సంపాదన యీ సంసారానికుపకరిస్తుంది. తెలిసిన వారికి ఓ వంట మనిషి కావాలనన్నట్లు విన్నాను..."

నిప్పు తొక్కినట్టు ఛర్రున లేచాడు. "ఏమిటి నువ్వనేది? నీకేమన్నా మతీ సుతీ పోయాయా? మన వంశం........ మన గౌరవం.... పరువు ప్రతిష్టలు మంట గలుపుదామనకుంటున్నావా? మరెప్పుడూ యిలా పిచ్చి పిచ్చి మాటలాడకు నేనింకా బతికే ఉన్నాను. నన్ను నలుగురిలోనూ చవటని చాటదలుచుకుంటే...."

కోపంతో ఊగిపోయాడు. బక్కవాడికి కోప మెక్కువంటారు. నిజమేనన్నమాట. అసమర్థతవల్ల వచ్చే ఆవేశ కొద్దీ అలా ఆగ్రహించాడు కానీ నిజానికి నే నేమంత మాట అన్నానని?

అన్నంలేక మాడితే తప్పులేదు. అన్నం వొండి అర్జించుకుంటే తప్పు! గౌరవ హాని!! కుటుంబానికి కళంకం. మాయని మచ్చ. ఏమిటీ మధ్య తరగతి మిథ్యా గౌరవాలు? ఏం జరిగినా, ఎంత దిగజారినా వీళ్ళ కళ్లు తెరచుకోవా? జ్ఞానోదయం కాదా? ఏమైతేనేం, నాన్నంటే భయం కొద్దీ కాక జాలిపడి - వంటమనిషి అవతారం ఎత్తడం తాత్కాలికంగా విరమించుకున్నాను. కుర్చీలో కూర్చుని చేసేదే ఉద్యోగమా? కుక్ ఉద్యోగం కాదా? ఈ సందేహం నా కుండనే ఉంది.

o o o

ఇంటికెవరయినా వస్తే—మొట్టమొదటి ప్రశ్న—"జానకి పెళ్ళేం చేశారు?" అనే.

"ఇంకా.....(మీ.....లేదు ...." రుద్ధ కంఠంతో అమ్మ....

"అయ్యో!....ఇంకా కాలేదూ? ఇంకెప్పుడౌతుందో?"

అది—సానుభూతి కాదు. నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించడమంటారే, అలాంటిది. నేనెక్కడి కయినా వెడితే - కొందరు నన్నే సూటిగా అడిగేసేవారు. "నీ పెళ్లి కాలేదూ? అయ్యో!....నీకేం యీడు తక్కువా?... పెళ్ళయితే యీ పాటికి బిడ్డలతల్లి వయ్యేదానివి...."

ఆ మాటలు యీటెల్లా నా గుండెల్లో గుచ్చుకునేవి.

ఆ మాటలు బాకుల్లా-మనసులో గాయాలు చేసి-బాధించేవి. వొంటికి తగిలిన దెబ్బలయితే మానుతాయి. మనసుకి తగిలిన గాయాలు మానవు, భరించలేక.... నిగ్రహించుకోలేక... ఓసారి - అమ్మముందు ఏడ్చేశాను వెక్కి వెక్కి.


"నేనీ బ్రతుకిక బ్రతకలేనమ్మా...బ్రతకలేను. నాకు పెళ్లి కాకపోతే అది నా నేరమా? నేను చెయ్యని తప్పుకి నన్నెందుకు శిక్షిస్తారందరూ! నేను భరించలేనమ్మా....భరించలేను. నేను చచ్చిపోతానమ్మా! చచ్చిపోతాను"

అమ్మ నన్ను ఓదార్చలేదు పైగా-మండి పడింది.

"నీకు పుణ్యముంటుంది-నువ్వు ఒలవంతపు చావు చచ్చి మమ్మల్నిందరినీ చంపకు. తా చెడ్డ కోతి వనమెల్లా చెరిచిందని—నువ్వు చేసే వెధవపని నీతో పోదు. ఇంటిల్లిపాదినీ చుట్టుకుంటుంది. నలుగురూ మా ముఖాలమీద పేడనీళ్ళు జల్లుతారు. తలెత్తుకు తిరగలేక చావాలి. అందరం సర్వనాశన మౌతాం. తల్లీ. నువ్వే పాడుపనీ తలపెట్టకు. అదే పదివేలు...."

అమ్మ తిట్లకు తుళ్లిపడ్డాను.

నా నిర్భాగ్య జీవితంలోని చీకటి కోణాలలో మరొకటి బయటపడింది.




నేనెంత అస్వతంత్రురాలినో అర్థమైంది. నా జీవితంమీద నాకధికారం లేదు. నా బ్రతుకు నాదికాదు. నా యిష్టమొచ్చినట్లు చావడానికి కూడా నాకు స్వతంత్రం లేదు. ఎంత బాధగా ఉన్నాసరే, నేను బతికి తీరాలి. నాకోసం కాదు, నావారికోసం. నేను చస్తే వారికి తలవంపులు! వాళ్ళ పరువు ప్రతిష్టల (?) కోసం....నా చెల్లెళ్ళూ తమ్ముళ్ళ భవిష్యత్తుకోసం....నేనీ పాపపు బతుకుని చివరవరకూ మోసుకుంటూ వెళ్ళాలి. నేను బందీని. బానిసను. అస్వతంత్రను!

○ ○ ○

పూవు-సకాలంలో ఫలదీకరణం చెందకపోతే- వాడి రాలి-ధూళిలో కలుస్తుంది. ఆడపిల్ల మనసు-తరుణం దాటిపోతే-మళ్ళిపోతుంది. నన్ను మీర సహియించుకున్నా సరే-మొదటి మనవి చేసుకున్నట్లు-నా మనసులోని నిజాన్ని చెప్పదలుచుకున్నాను.

ఈర్ష్య...అసూయలతో నా మనసు కుళ్ళిపోడం మొదలు పెట్టింది.

శుభలేఖ చూస్తే-వొంటికి కారం పూసుకున్నట్టే-ముక్కలుగా చింపి పారేసేదాన్ని. పెళ్ళయిన వాళ్ళని చూస్తే అసూయతో గుండెలు మండిపోయేవి. రోడ్డు మీద దంపతులు వెళ్ళడం నా కంట పడితే-కసితీరా శాపాలు పెట్టేదాన్ని-వాళ్ళే బస్సు కిందో పడి చావాలని, పెళ్ళికాని ఆడపిల్లలను చూస్తే-"ముందుంది ముసళ్ళ పండుగ. రేపు మీకు నాగతే పడుతుంది." అని సంతోషించేదాన్ని. మగాళ్ళని చూస్తే రోకలి పుచ్చుకొని నెత్తి చితగ్గొట్టాలన్నంత కోపం వచ్చేది. అసలి పెళ్ళి అనేది ఎవరు కనిపెట్టారో....వాళ్ళని నిలువునా మంట పెట్టెయ్యాలనిపించేది. నాకు తెలుసు-నేను పచ్చకామెర్ల రోగిలా తయారయ్యానని. నాకు దొరకని జీవితం-వాళ్ళకి

లభిస్తోందన్న అసూయతో-నేను కుళ్ళి చస్తున్నాననీ, అది ఆరోగ్యకరంకాదనీ— నాకూ అనిపించేది. కాని - ఏమీ చెయ్య లేకపోయేదాన్ని. మనసు కోతేకాదు. కోరలున్న విషసర్పం కూడా. నా మనసులోని విషపు ఆలోచనలు నన్నే కాటువేస్తున్నాయని గ్రహించినా ఏమీ చేయలేక అసహాయగా మిగిలిపోయేదాన్ని.

నా మనసులో-కనే తప్ప కరుణ యింకిపోయింది,

పగ తప్ప ప్రేమ నశించిపోయింది.

అసూయ తప్ప అనురాగం అంతరించిపోయింది-

ద్వేషమే మిగిలింది-

శాశ్వతంగా చీకటే నిండిన యీ జీవితాన్నెలా తరించను ?

ఈ బ్రతుకెందుకు? కుమిలి కుమిలి క్రుళ్లి మగ్గడానికేనా ?

o o o

వివాహమూ- కాదు.

ఉద్యోగమూ - రాదు-

స్వతంత్రంగా బ్రతికే వీలా- లేదు.

ప్రాణమూ — వదలిపోదు.

జీవితంలో ఏ ఆశా- కనిపించదు.

రేపు కూడా జీవన సంగీతం వినిపించదని యివాళే తెలిసిపోతూంది-

నిన్న—

నేడు-

రేపు-

అదే జీవితం.

మార్పులేని బతుకు.

మలుపు తిరగని బతుకు

గమ్యంలేని— అర్థం తెలియని, వ్యర్థ జీవితం,

నిస్సారంగా - సాగే కాలం,

ఈ తీరని శాపాన్ని జీవితపు అవతలి



ఒడ్డు వరకూ మోసుకువెళ్ళవలసిందేనా యిలా ?

విముక్తి కనిపించని యీ బండ బతుకు- చిరకాలమూ భరించవలసిందేనా ? ఒక్క చిరునవ్వుకి నోచుకోకుండా, ఎన్నటికీ యింతేనా ?

ఎందుకీ శాపదగ్ధ జీవితం ?

దీనికి నిష్కృతి ఏమిటి ?

ఎప్పుడు ?

అది—

ఏ మహాత్ముడు,

ఏ మహర్షి,

ఏ మహా మనిషి,

ఎవరు ?

ఎప్పుడు ?

ఎలా చూపుతారు ?

ఈ కథలోని అవస్థ - యీ జానకి ఒక్కతేకాదు.

నా వంటి జానకులు - యీ సమాజంలో లక్షల కొద్దీ ఉన్నారు.

కొండ అద్దమందు కొంచమై కన్పట్టునన్నట్టు— నా వంటి అమ్మాయి అనుభవించే అవస్థనంతటినీ మీ ముందు యథాతథంగానూ ప్రతిభావంతంగానూ మీముందుంచలేకపోయుంటాను, అందుకు కారణం నాలో లోపమే తప్ప, అవస్థలోని తేలికతనం ఎంతమాత్రమూ కాదు.

కులమత నిర్మూలనకూ, నిరుద్యోగ సమస్యకీ పరిష్కారాలు ప్రభుత్వం ఆలోచిస్తోంది. కొద్దో గొప్పో చేయనూ చేస్తుంది.

కాని-

నా వంటి పిల్లల 'నిర్వివాహ' సమస్య గురించి ఎవరాలోచిస్తున్నారు ?

వ్యవస్థా వృక్షానికి కుక్కమూతిపిందెల్లా యీ జానకి ఇలాగే మిగిలిపోవలసిందేనా?

ఆలోచించండి- హృదయంతో.